'మహిళలు స్వయం నిర్ణయాధికారం కోసం పోరాడాలి'

నల్లకుంట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత భూస్వామ్య, కార్పొరేట్, సామ్రాజ్యవాదులను వ్యతిరేకిస్తూ స్త్రీ విముక్తి సాధనలో పయనిస్తూ తమకు ఉన్న హక్కులను కాపాడుకుంటూ మహిళలు స్వయం నిర్ణయాధికారం, ఉపాధి అవకాశాల కోసం విద్యా, వైద్య రంగాల్లో సమానత్వం కోసం పోరాడాలని చైతన్య మహిళా సంఘం నేతలు పిలుపునిచ్చారు. శనివారం హైదర్‌గూడలోని ఎన్‌ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చైతన్య మహిళా సంఘం (సీఎంఎస్) రాష్ట్ర కన్వీనర్ బి.జ్యోతి, నగర కన్వీనర్ ఎస్.సత్య, నాయకులు బి.విజయ, ఎ.సావిత్రి, సి.అలివేలు, కె.భాగ్య, వి.శ్రీదేవి మాట్లాడారు. ఈనెల 8వ తేదీన వికారాబాద్ జిల్లాలో అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినం సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

వైభవంగా రాఘవేంద్రస్వామి పట్టాభిషేకం

బర్కత్‌పుర, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): బర్కత్‌పురలోని రాఘవేంద్రస్వామి మఠంలో పట్టాభిషేక మహోత్సవం శనివారం ప్రారంభమైంది. ఆరు రోజుల పాటు ఈ వేడుకలు జరగనున్నాయి. ఉదయం పంచామృతం, అష్టోత్తర సహిత పుష్పార్చన సేవ, రథోత్సవం ఘనంగా నిర్వహించారు. నైవేద్యం, మహా మంగళ హారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు.

5వ తేదీ నుంచి మహిళలకు ఉచిత కరాటే శిక్షణ

బర్కత్‌పుర, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జీవీఆర్ కరాటే అకాడమి ఆధ్వర్యంలో ఈ నెల 5 నుంచి 15వ తేదీ వరకు ఆత్మరక్షణ కోసం కరాటేలో ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు అకాడమి డైరెక్టర్ డాక్టర్ జీఎస్.గోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 3వ తేదీలోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. కాచిగూడలోని అకాడమి కార్యాలయంలో ఈ శిక్షణ ఉంటుందని తెలిపారు. వివరాలకు 9494112424 ఫోన్‌నెంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

బాపూనగర్‌లో చెత్త తొలగించాలి : టీడీపీ

చిక్కడపల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్ సమస్యలకు అడ్డాగా మారిందని టీడీపీ డివిజన్ ఇన్‌చార్జి భవాని శ్రీనివాస్ ఆరోపించారు. వివేక్‌నగర్, అశోక్‌నగర్, లైబ్రరీ లేన్, బాపూనగర్‌లో నడిరోడ్లపై చెత్తవేస్తే పట్టించుకునేవారే కరువయ్యారని దీనికి శాశ్వత పరిష్కారం చూపించాల్సిన అధికారులు మాకు సంబంధం లేదు అన్నట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. చిక్కడపల్లి మెట్రోస్టేషన్ వద్ద అల్లరిమూకల అడ్డా తయారుచేస్తున్నారని బాపూనగర్ కాలనీ లోపలికి వెళ్లేవారితో గొడవలకు దిగుతున్నారని ఆరోపించారు. తగుచర్యలు తీసుకోవాలని లేదంటే ధర్నా చేస్తామని హెచ్చరించారు.

ప్లాస్టిక్ వస్తువులకు దూరంగా ఉండాలి

చిక్కడపల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ వస్తువులకు దూరంగా ఉండాలని ప్రపంచ పర్యావరణ సంస్థ వ్యవస్థాపకులు డా.సీహెచ్.భద్ర పిలుపునిచ్చారు. చిక్కడపల్లిలో శనివారం ప్రపంచ పర్యావరణ సంస్థ సహాయ కార్యదర్శి రాజేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన పర్యావరణ పరిరక్షణ అవగాహన కార్యక్రమంలో డా.భద్ర పాల్గొని మాట్లాడుతూ మానసమాజం ఇప్పటికైనా కళ్లు తెరవాలని సూచించారు. ప్రకృతిని కాపాడుకోవడం అంటే దేవుడిసేవ చేసినట్లేనని వివరించారు. పర్యావరణాన్ని కాపాడుకుంటేనే ఆరోగ్యకరమైన జీవితాన్ని పొందగలుగుతామన్నారు. పర్యావరణవేత్త డా.జ్యోశ్నారావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తన జీవితంలో కనీసం 10 మొక్కలు నాటాలన్నారు. హుస్సేన్‌సాగర్ ప్రపంచంలోనే అత్యంత కాలుష్యమైన సరస్సుగా మారి, చుట్టుపక్కల ప్రాంతాల జీవజాతి పూర్తిగా దెబ్బతిన్నదన్నారు. ప్రపంచ పర్యావరణ సంస్థ కార్యవర్గసభ్యులు సునీల్, తేజ, బన్నియాదవ్, మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో బడుగులకు స్థానం లేదు: టీడీపీ

చిక్కడపల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీలో బడుగు బలహీన వర్గాలకు ఏనాడూ సరైన స్థానం లేదని టీడీపీ జాతీయ ప్రచార కార్యదర్శి జంగం దశరథ్ ఆరోపించారు. బీసీవర్గానికి చెందిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను సస్పెండ్ చేయడంతోనే కాంగ్రెస్ పార్టీకి బీసీలపై ఎలాంటి చిన్నచూపు ఉన్నదో తెలుస్తుందన్నారు. టీడీపీ స్థాపించినప్పటి నుంచి బీసీలను ప్రోత్సహిస్తోందన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్-1 పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ వినోద్‌కుమార్ తెలిపారు. వీఎస్టీ 11 కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలోని పటేల్‌నగర్, అజంతాగేట్ తదితర ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి 12, జేఎన్, జేఎం ఫీడర్ల పరిధిలోని మాలకుంట, గోవర్ధన్ చాంబర్స్, బాషా మంజిల్, కరీమాబాద్ కాలనీ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కొత్త రేషన్‌కార్డులు జారీ చేయాలి : టీడీపీ

రాంనగర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): కొత్త రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ వెంటనే చేపట్టాలని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పార్టీ నగర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మార్చి 1వ తేదీ నుంచి కొత్త రేషన్‌కార్డులను ఎక్కడ జారీ చేశారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు పూర్తయినా నేటి వరకు రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ నిర్వహించలేదని ఆరోపించారు. దరఖాస్తు చేసుకున్న వారందరికీ కొత్తరేషన్‌కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శులు నల్లెల కిషోర్, పలుస బాల్‌రాజ్‌గౌడ్, నాయకులు నాగునగేష్, ప్రసాద్ పాల్గొన్నారు.

ఉచిత దంత వైద్య శిబిరానికి విశేష స్పందన

ముషీరాబాద్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): దంత సౌంరక్షణతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని ప్రముఖ డెంటల్ డాక్టర్ నవ్యతేజ అన్నారు. ముషీరాబాద్‌లోని ఆమ్‌వీ క్లినిక్ మొదటి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆస్పత్రిలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా దంత పరీక్షలు, బీపీ, షుగర్, ఈసీజీ, సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరం ఆదివారం కూడా కొనసాగుతుందని ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ఎండీ సందీప్, డాక్టర్లు పాల్గొన్నారు.

జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించాలి

ముషీరాబాద్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో మహంకాళి జిల్లా పరిధిలోని అన్ని నియోజకవర్గాలలోని డివిజన్‌లలో బీజేపీ ఘన విజయం సాధించేలా ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్ అన్నారు. శనివారం బీజేపీ రాష్ట్ర నాయకుడు ఆర్.విశ్వం ఆధ్వర్యంలో భోలక్‌పూర్‌లో టిఫిన్ పే చర్చాకార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్.విశ్వంను సన్మానించారు. ఈ సమావేశంలో బీజేపీ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు రాజశేఖర్, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బిజ్జి కనకేష్ కుమార్, నాయకులు నిత్యానంద్, మహేష్, నాగేందర్, రాజేష్, సత్యనారాయణ, బబ్లూ, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

బాపూజీనగర్‌లో అన్నదానం

ముషీరాబాద్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ డివిజన్ బాపూజీనగర్‌లో అభయాంజనేయస్వామి దేవాలయం వద్ద బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు తలారి శ్రీకాంత్ ముదిరాజ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్యఅతిథిగా హాజరైన బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎం.నవీన్ గౌడ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కంచి ముదిరాజ్, నాయకులు శ్రీను, అశోక్ కుమార్, పట్నం నరేష్, ప్రకాష్, ప్రవీణ్ గౌడ్, వెంకటేష్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ అమరుల సేవలు చిరస్మరణీయం


ఎస్సీ వర్గీకరణ కోసం అసువులు బాసిన వారి చిత్రపటాలకు నివాళులు అర్పిస్తున్న నేతలు

కవాడిగూడ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ కోసం అసువులు బాసిన అమరుల సేవలు చిరస్మరణీయమైనవని పలువురు ఎంఆర్‌పీఎస్ మాదిగ దండోరా నేతలు పేర్కొన్నారు. శనివారం కవాడిగూడ డివిజన్‌లోని రోటరీకాలనీ బస్తీఅధ్యక్షుడు యాదగిరి మాదిగ ఆధ్వర్యంలో మాదిగ అమరవీరుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కవాడిగూడ రోటరీ కాలనీ బస్తీలోని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహం వద్ద మాదిగ, అమర వీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

సర్కిళ్లలో జవాన్లపై బదిలీ వేటు

- ముషీరాబాద్‌లో 9 మంది, అంబర్‌పేటలో 10 మందికి స్థానచలనం
- 5 సంవత్సరాలకు పైబడి పనిచేస్తున్నవారికి ఆర్డర్లు జారీ

రాంనగర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ముషీరాబాద్, అంబర్‌పేట సర్కిల్స్ పరిధిలో 5 సంవత్సరాలకు పైబడి పనిచేస్తున్న 19 మంది జవాన్లపై జీహెచ్‌ఎంసీ కమిషనర్ బదిలీవేటు వేశారు. ముషీరాబాద్ సర్కిల్‌లో 9 మంది, అంబర్‌పేట సర్కిల్‌లో 10 మంది జవాన్లకు ఇతర సర్కిళ్లకు బదిలీ చేశారు. కమిషనర్ ఇచ్చిన ఆదేశాలను ముషీరాబాద్ సర్కిల్ డీఎంసీ రామానుజల రెడ్డి, అంబర్‌పేట సర్కిల్ డీఎంసీ మారుతిదివాకర్‌రావు శనివారం ఉదయం యుద్ధప్రాతిపదికన వారిని ఈ సర్కిళ్ల నుంచి రిలీవ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఈ ఉత్తర్వులను జవాన్లు వెంటనే తీసుకోవాలని సూపరింటెండెంట్లు ఫోన్‌లో సమాచారం అందించారు. కానీ బదిలీ ఉత్తర్వులను తీసుకోవడానికి వారు ససేమీరా అనడంతో వాట్సాప్‌ల ద్వారా బదిలీ ఉత్తర్వులను వారికి పంపించారు. వాట్సాప్ పంపిన ఉత్తర్వులకు కూడా జవాన్లు స్పందించలేదు. వారిని మంగళవారం నుంచి విధులలోకి రానీవ్వవద్దని వచ్చిన వారికి ఎలాంటి అటెండెన్స్ వేయవద్దని ఈ రెండు సర్కిల్స్‌కు చెందిన ఏఎంహెచ్‌వోలను ఆదేశించారు. అనేక సంవత్సరాలుగా ఈ సర్కిళ్లలో పనిచేస్తూ ఇష్టానుసారంగా వ్యవహరించడం వల్లనే ఈ బదిలీ వేటు సాగుతుంది. ఒకేసారి 19 మంది జవాన్లను బదిలీ చేయడం ఈ రెండు సర్కిళ్ల పరిధిలో చర్చనీయంశంగా మారింది.


జీహెచ్‌ఎంసీ ముషీరాబాద్, అంబర్‌పేట సర్కిల్ కార్యాలయ భవనం

బదిలీ అయిన జవాన్ల వివరాలు

అంబర్‌పేట సర్కిల్‌లో పనిచేస్తున్న లక్ష్మీనారాయణ, ఎ.అశోక్‌కుమార్, ఎస్.ప్రేమానందం, డి.ఎల్లేష్, సరళ, కె.యాదగిరికుమార్, కె.శ్రీనివాస్‌లు ముషీరాబాద్ సర్కిల్‌కు బదిలీ అయ్యారు. ఎం.శంకర్ అల్వాల్ సర్కిల్, రాంబాబు బేగంపేట సర్కిల్, జ్యోతికుమార్ సికింద్రాబాద్ సర్కిల్‌కు బదిలీ అయ్యారు. ముషీరాబాద్ సర్కిల్‌లో పనిచేస్తున్న బి.మోహన్‌దాస్, ఎ.బాల్‌రాజ్, డి.శేఖర్‌బాబు, శివకుమార్, వి.నర్సింహ, ఎస్.విజయ్‌కుమార్, కె.జనార్దన్, వి.అగస్టిన్, పి.వెంకటేశ్‌ను నగరంలోని వివిధ సర్కిళ్లకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

బదిలీ ఉత్తర్వుల రద్దుకు జవాన్ల పైరవీలు

ముషీరాబాద్, అంబర్‌పేట సర్కిళ్లలో దీర్ఘకాలంగా పనిచేస్తున్న 19 మంది జవాన్లు తాము ఆడిందే ఆటగా విధులు నిర్వహించారు. డ్యూటీలు సక్రమంగా చేయకుండా జీతాలు మాత్రం తీసుకునే వారనే విమర్శలు ఉన్నాయి. దీర్ఘకాలంగా పనిచేస్తున్న జవాన్లకు బదిలీల ఉత్తర్వులు జారీ చేయడంతో వారు అవాక్కయ్యారు. బదిలీ ఉత్తర్వులను రద్దు చేయడం కోసం జవాన్లు కొంత మంది పైరవీలు చేస్తున్నట్లు సమాచారం.

ప్రజా సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం: వక్తలు

కవాడిగూడ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): నిత్యం పెరిగిపోతున్న ప్రజాసమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని సోషలిస్టు యూనిటీ సెంటర్ ఆఫ్ ఇండియా) కమ్యూనిస్టు తెలంగాణ రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ నేతలు ఆరోపించారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేయాలని లేనిపక్షంలో ఆందోళన చేస్తామని వారు హెచ్చరించారు. ఎస్‌యూసీఐ(సీ) సోషలిస్టు యూనిటీ సెంటర్ ఆఫ్ ఇండియా(కమ్యూనిస్టు) తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో ముఖ్యఅతిథులుగా హాజరైన కేంద్రకమిటీ సభ్యులు కె.శ్రీధర్, ఎస్‌యూసీఐ(సీ) రాష్ట్ర కార్యర్శి సీహెచ్.మురహరి, నగర కార్యదర్శి భరత్, రాష్ట్ర కమిటీ సభ్యులు జానీబాషా, గంగాధర్ హాజరై మాట్లాడారు. తెలంగాణ వ్యాప్తంగా ప్రజలు నిత్యం ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ఇందిరాపార్కు వద్ద జరిగిన ధర్నాలో పాల్గొని మాట్లాడుతున్న ఎస్‌యూసీఐ(సీ) రాష్ట్ర కార్యదర్శి సీహెచ్.మురహరి తదితరులు

ఎన్టీఆర్ స్టేడియంలో మట్టి, చెత్త వేయొద్దు

రాంనగర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ స్టేడియంలో మట్టి, చెత్త వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ముషీరాబాద్ సర్కిల్ డీఎంసీ రామానుజులరెడ్డి హెచ్చరించారు. స్టేడియంలో పేరుకుపోయిన మట్టి, చెత్త తొలగింపునకు వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. 'ఆంధ్రజ్యోతి'లో శుక్రవారం ప్రచురితమైన డంపింగ్ యార్డుగా మారిన ఎన్టీఆర్ స్టేడియంపై ఆయన స్పందించారు. ఈ సమస్యను పరిష్కరించాలని సర్కిల్ శానిటేషన్ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. స్టేడియంలో ఎవరు కూడా మట్టి, వ్యర్థాలు వేయకుండా పర్యవేక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. దుర్వాసన రాకుండా క్రిమిసంహారక మందులు చల్లాలని సూచించారు.


డీఎంసీ రామానుజులరెడ్డి


సయ్యద్ అహ్మద్ భక్తియార్‌ను సన్మానించిన బీఆర్ఎస్ నాయకులు

విద్యతోనే ఉజ్వల భవిషత్: ట్రస్మా

ముషీరాబాద్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే ఉజ్వల భవిష్యత్ అని విద్యావ్యాప్తికి తెలంగాణ రికగ్నైజ్‌డు స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ట్రస్మా) అంకిత భావంతో కృషిచేస్తున్నదని ట్రస్మా ముషీరాబాద్ విద్యామండలి అధ్యక్షుడు సయ్యద్ అహ్మద్ భక్తియార్ అన్నారు. ట్రస్మా ముషీరాబాద్ మండల నూతన అధ్యక్షుడిగా నియమితులైన సయ్యద్ అహ్మద్ భక్తియార్‌ను శనివారం ముషీరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ ఉపాధ్యక్షుడు జి.రాజు ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ముషీరాబాద్ డివిజన్ మాజీ అధ్యక్షుడు అజయ్ ముదిరాజ్, డివిజన్ ఉపాధ్యక్షులు మోహిన్, ఎస్సీ సెల్ డివిజన్ అధ్యక్షుడు సదా, పార్టీ సీనియర్ నాయకులు బాలరాజు గౌడ్, కొండా సహదేవు తదితరులు



మాట్లాడుతున్న జీఆర్‌ఈఏ రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి

రిటైర్డ్ ఉద్యోగులకు పీఆర్‌సీని అమలు చేయాలి

రాంనగర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులకు పీఆర్‌సీని అమలు చేయాలని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం (జీఆర్‌ఈఏ) రాష్ట్ర అధ్యక్షుడు జి.దామోదర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రిటైర్డ్ ఉద్యోగుల పెండింగ్ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు పూర్తయినా ఒక్క సమస్య కూడా పరిష్కారానికి నోచుకోలేదన్నారు. పీఆర్‌సీ నివేదికను వెంటనే తెప్పించి 2023 జూలై నెల నుంచి అమలు చేయాలన్నారు. సంఘం సెక్రటరీ జనరల్ పి.చంద్రశేఖర్ మాట్లాడుతూ పీఆర్‌సీ డీఏ నగదు రహిత వైద్యం వంటి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు సీతారామయ్య, విశ్వనాథం, మోహన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్యామ్‌రావు, శంకర్‌రెడ్డి, ప్రహ్లాదరావు, సూర్యప్రకాష్, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ యువనేతకు దత్తాత్రేయ కుమార్తె పరామర్శ

చిక్కడపల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): బీజేపీ యువనేత దోనేటి సత్యంను శనివారం సాయంత్రం హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ కుమార్తె బండారు విజయలక్ష్మి పరామర్శించారు. సత్యం అనారోగ్యానికి గురైన విషయం తెలుసుకుని ఆర్టీసీక్రాస్‌రోడ్ జవహర్ నగర్‌లోని ఆయన నివాసానికి చేరుకుని పలకరించి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. బీజేపీ ఓబీసీమోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీకాంత్‌గౌడ్, అడిక్‌మెట్ మాజీ డివిజన్ అధ్యక్షుడు నరేష్, భోలక్‌పూర్ నూతన డివిజన్ అధ్యక్షుడు రాజశేఖర్, నాయకులు రమేష్‌గౌడ్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మసీదుల వద్ద సమస్యలు తలెత్తకుండా చర్యలు

- ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పవిత్ర రంజాన్ మాసంలో మసీదుల వద్ద ఎలాంటి సమస్యలూ ఉత్పన్నం కాకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ సూచించారు. శనివారం రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే గోపాల్ జీహెచ్‌ఎంసీ డీఈ సన్నీ, శానిటైజేషన్ సూపర్‌వైజర్ గోవర్ధన్, జలమండలి డీజీఎం కార్తిక్‌రెడ్డి, సెక్షన్ మేనేజర్ కృష్ణమోహన్, విద్యుత్‌శాఖ స్ట్రీట్ లైట్ సూపర్ వైజర్ బాలునాయక్, ముషీరాబాద్ ఎస్సై ప్రసాద్‌రెడ్డి, చిక్కడపల్లి ట్రాఫిక్ ఎస్సై యాదగిరి రెడ్డితో సమీక్షా సమావేశం నిర్వహించారు. డివిజన్‌లోని ప్రసిద్ధిగాంచిన బడీ మసీదు, బిలాల్ మసీదు తదితర వాటిని సందర్శించి మసీదు నిర్వాహకులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో ముషీరాబాద్‌కు ప్రత్యేక స్థానం ఉందని, హిందూ ముస్లింలు అధికంగా ఉన్నప్పటికీ కలిసిమెలిసి ఉంటారని పేర్కొన్నారు. అధికారులు స్పెషల్ కేర్ తీసుకుని రంజాన్ మాసంలో నెలరోజులపాటు మసీదుల వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారం, మట్టికుప్పలను తొలగించాలన్నారు. మంచినీటి సౌకర్యం, నిరంతరం విద్యుత్ సరఫరా, రోడ్డు ప్యాచ్ వర్కు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, రాష్ట్ర నాయకులు షరీఫ్, రహీం, డివిజన్ ఉపాధ్యక్షుడు శంకర్ గౌడ్, బీఆర్ఎస్ నియోజకవర్గం మీడియా సెల్ ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, డివిజన్ మాజీ అధ్యక్షుడు మహ్మద్‌అలీ, నాయకులు ప్రవీణ్, సాయి, ఆరీఫ్ పాల్గొన్నారు.


బడీ మసీదు వద్ద జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోపాల్

మూసారాంబాగ్ బ్రిడ్జి నిర్మాణ పనులపై సమీక్ష

గోల్నాక, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మూసీ నదిపై అంబర్‌పేట అలీకేఫ్ చౌరస్తా నుంచి నిర్మిస్తున్న మూసారాంబాగ్ హైలెవల్ బ్రిడ్జి పనుల తీరుపై శనివారం గోల్నాక తులసీనగర్‌కాలనీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ప్రాజెక్టు అధికారులతో సమీక్షించారు. శంకుస్థాపన జరిగి ఏడాది గడిచిపోయినా పనులు వేగవంతంగా జరగకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, ట్రాఫిక్ సమస్యలు కూడా ఇబ్బందికరంగా మారాయని ఎమ్మెల్యే అధికారులకు వివరించారు. అంబర్‌పేట నుంచి దిల్‌సుఖ్‌నగర్ వెళ్లే ప్రధాన రహదారి కావడంతో సంవత్సర కాలంగా ఒకవైపు వాహనాల రాకపోకలు బంద్‌చేసి బ్రిడ్జి నిర్మాణ పనులు కొనసాగిస్తున్నారన్నారు. దిల్‌సుఖ్‌నగర్ నుంచి వచ్చే వాహనాల రాకపోకలకు వీలు ఉండగా, అంబర్‌పేట నుంచి దిల్‌సుఖ్‌నగర్ వెళ్లే దారిని బంద్‌చేసి పనులు చేపడుతున్నారు. దీంతో వాహనాలు గోల్నాక కొత్తబ్రిడ్జి నుంచి చుటూ తిరిగిపోవాల్సి వస్తుందని, దీంతో జిందాతిలిస్మాత్ రోడ్డులో ట్రాఫిక్ సమస్యలు తీవ్రతరంగా ఏర్పడ్డాయన్నారు. మరోవైపు నిర్మాణ పనులు మొదలు పెడుతే ఈ దారికూడా బంద్‌చేయడంతో ట్రాఫిక్ సమస్య జఠిలంగా మారే అవకాశం ఉదని ఎమ్మెల్యే అధికారులకు చెప్పారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని త్వరితగతిన హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులను పూర్తిచేయాలన్నారు. ఈ వేసవికాలంలోనే బ్రిడ్జి పనులను పూర్తిచే దిశగా వ్యూహాత్మకంగా అధికారులు పనిచేయాలని తెలిపారు. ఈ సమావేశంలో ప్రాజెక్టు ఈఈ రోహిణి, ఏఈ ప్రశాంత్ ఇంకా పలువురు అధికారులు పాల్గొన్నారు.


మూసారాంబాగ్ బ్రిడ్జి పనులపై ప్రాజెక్టు అధికారులతో సమీ సమీక్షిస్తున్న ఎమ్మెల్యే వెంకటేష్

తాగునీటి సమస్యలను పరిష్కరించాలి : కార్పొరేటర్

చిక్కడపల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మంచినీటి లోప్రెషర్, పలు బస్తీల్లో నీటి ఎద్దడి సమస్యలను పరిష్కరించేందుకు వెంటనే చర్యలు చేపట్టాలని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ జలమండలి అధికారులకు సూచించారు. శనివారం కార్పొరేటర్ కార్యాలయంలో జలమండలి డీజీఎం కార్తీక్‌రెడ్డి, మేనేజర్ కృష్ణమోహన్‌తో డివిజన్‌లోని పలు బస్తీలు, కాలనీల్లో మంచినీటి సమస్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పావని జలమండలి అధికారులతో మాట్లాడుతూ రానున్న వేసవి కాలంలో డివిజన్‌లో ఎక్కడా మంచినీటి కొరత ఏర్పడకుండా ఉండాలన్నారు. వెంటనే సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న నూతన పైప్‌లైన్ ఏర్పాటు పనులను ప్రారంభించి పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. సమీక్షలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, వాటర్‌బోర్డ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ శంకర్ పాల్గొన్నారు.


ట్రెడిషనల్ డేలో పాల్గొన్న డాక్టర్ బీఆర్.అంబేద్కర్ విద్యా సంస్థల విద్యార్థులు

సంస్కృతీ సంప్రదాయాలను యువత పాటించాలి

రాంనగర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను నేటి యువత పాటించాలని డాక్టర్ బీఆర్.అంబేద్కర్ విద్యా సంస్థల ప్రిన్సిపాల్ డాక్టర్ మట్ట శేఖర్ సూచించారు. శనివారం బాగ్‌లింగంపల్లిలోని కళాశాల ఆవరణలో ట్రెడిషన్ డే నిర్వహించారు.


పూజలు నిర్వహిస్తున్న స్వామి బోదమయానంద, భక్తులు

ఘనంగా 'రామకృష్ణ పరమహంస' వేడుకలు

కవాడిగూడ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): లోయర్ ట్యాంక్‌బండ్‌లోని రామకృష్ణ మఠంలో రామకృష్ణ పరమహంస వేడుకలను శనివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. భగవాన్ శ్రీ రామకృష్ణ పరమహంస బోధనలకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి బోదమయానంద సూచించారు. కార్యక్రమంలో భాగంగా బాల వికాస్ విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

బీసీ మహిళలకు 50 శాతం సబ్‌కోటా కేటాయించాలి

చిక్కడపల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం చట్టసభల్లో మహిళలకు కేటాయించిన 33 శాతంలో బీసీ మహిళలకు 50 శాతం సబ్‌కోటా కేటాయించాలని తెలంగాణ బీసీ సంఘం అధ్యక్షుడు ఆరె.మహేందర్, తెలంగాణ బీసీ ఉద్యోగుల సంక్షేమసంఘం రాష్ట్ర కోకన్వీనర్ కె.రామాంజనేయులు విజ్ఞప్తి చేశారు. శనివారం సాయంత్రం వారు చిక్కడపల్లిలో మాట్లాడారు. పార్లమెంటులో ఆమోదం పొందిన మహిళా బిల్లులో బీసీ మహిళలకు 50 శాతం సబ్‌కోటాను కల్పించాలన్నారు. రానున్న పార్లమెంటు సమావేశాల్లో బీసీ మహిళల సబ్‌కోటాను ప్రవేశపెట్టి ఆమోదించాలని వారు కేంద్రప్రభుత్వాన్ని కోరారు.

నటుడికి కళాసేవక్ పురస్కారం ప్రదానం

చిక్కడపల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ రంగస్థల పద్యనటులు దొంతి జంగయ్యగౌడ్‌కు కళాసేవక్ పురస్కారం ప్రదానం చేశారు. శనివారం సాయంత్రం చిక్కడపల్లిలో శ్రీరామకృష్ణ నాట్యమండలి ఆధ్వర్యంలో జరిగిన 50 వసంతాల వేడుకల్లో భాగంగా జంగయ్యగౌడ్‌కు నిర్వాహకులు కళాసేవక్ పురస్కారం బహూకరించి సత్కరించారు. సంస్థ ప్రధానకార్యదర్శి, నటులు డా.జొన్నలగడ్డ జగన్మోహనరావు, కార్యదర్శి శ్రవణ్‌కుమార్ మాట్లాడుతూ జంగయ్యగౌడ్ నటుడుగా, గాయకుడుగా చేస్తున్న కళా సేవ గొప్పదన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు, కళాకారులు వడ్డి సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి.. ఐదుగురి అరెస్ట్

అంబర్‌పేట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): విదేశీ మహిళలతో ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్న ఓ విదేశీయుడితోపాటు మరో నలుగురు మహిళలను, ఓ విటుడిని అంబర్‌పేట పోలీసులు అరెస్ట్ చేశారు. అంబర్‌పేట సీఐ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం... నైజీరియా దేశానికి చెందిన తిమోతి ఫా బార్చి డిగ్రీ చదవడానికి నగరానికి వచ్చాడు. డిగ్రీ తర్వాత తిరిగి వెళ్లకుండా తిమోతి నగరంలో చదువుతున్న పలువురు విదేశీ మహిళలతో వ్యభిచారం నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో గోల్నాక జిందాతిలిస్మాత్ సమీపంలోని ఓ ఇంట్లో తిమోతి వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు అంబర్‌పేట పోలీసులకు సమాచారం లభించింది. పోలీసులు ఆ ఇంటిపై దాడిచేశారు. అక్కడ బాధిత మహిళల్లో ఉగాండా దేశానికి చెందిన ముగ్గురు, కెన్యా దేశానికి చెందిన మరొకరు మొత్తం నలుగురిని, వ్యభిచార గృహం నిర్వాహకుడు తిమోతిని విటుడు బాలాజీరెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. బాధిత మహిళలను కాపాడి స్టేట్‌హోమ్‌కు తరలించారు. తిమోతి, బాలాజీరెడ్డిని రిమాండ్‌కు తరలించారు.

జర్నలిజంలో 'ఫాతిమా'కు డాక్టరేట్


డాక్టర్ ఫాతిమా

హైదరాబాద్ సిటీ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఆబిడ్స్‌లోని సెయింట్ జార్జ్ మహిళా డిగ్రీ అండ్ పీజీ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఫాతిమాకు ఉస్మానియా యూనివర్సిటీ జర్నలిజం విభాగం నుంచి పీహెచ్‌డీ డాక్టరేట్ లభించింది. ప్రొఫెసర్ నాగేశ్వర్ మార్గదర్శకత్వంలో "ప్రింట్ మీడియా అడ్వర్టైజింగ్‌లో ట్రెండ్స్ - ఎ స్టడీ విత్ ఫ్రంట్ పేజ్ అడ్వర్టైజ్‌మెంట్స్" అనే అంశంపై ఫాతిమా పరిశోధనను విజయవంతంగా పూర్తి చేశారు. పరిశోధనలో భాగంగా వివిధ జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో ఫాతిమా తన పరిశోధనా పత్రాలను ప్రదర్శించారు. పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా(పీఆర్‌ఎస్‌ఐ) నుంచి గతేడాది బెస్ట్ అకాడమిక్ కౌన్సెలర్ అవార్డును అందుకున్నారు. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందిన ఫాతిమాకు పలువురు విద్యావేత్తలు, పాత్రికేయులు, పీఆర్ నిపుణులు అభినందనలు తెలిపారు.